అంతటా.. స్వచ్ఛత మంత్రం


గాడవెల్లిలో వీధులు శుభ్రం చేస్తున్న సర్పంచ్ తదితరులు


చౌదరిగూడలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవి

మేడ్చల్: పారిశుద్ధ్య నిర్వహణ కోసం మున్సిపాలిటీలోని వార్డుల్లో.. గ్రామాల్లో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ఆదివారం కొనసాగింది. పట్టణంలోని వివిధ వార్డుల్లో మండలంలోని డబీల్‌పూర్, గౌడవెల్లి, నూతన్‌కల్ గ్రామాల్లో డ్రైవ్ కొనసాగింది. సర్పంచ్‌లు, నేతలు వీధులను శుభ్రం చేసి, వార్డుల్లో పర్యటించి డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిశీలించి పరిష్కారాలు చూపారు. సర్పంచ్‌లు గీతభాగ్యారెడ్డి, సురేందర్‌ముదిరాజ్, కవిత, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ఘట్‌కేసర్: గ్రామ యువత సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. నా ఊరు–నా బాధ్యత కార్యక్రమంలో భాగంగా చౌదరిగూడలో ఎంపీపీ నందకిశోర్, సర్పంచ్ రమాదేవి, స్థానిక యువకులతో గ్రామంలో ఆదివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామం, ఇంటి పరసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలంటే శ్రమదానంలో యువత ఉత్సాహంగా పాల్గొని గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు స్వామిదాస్, సుధాకర్, భోజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, స్థానిక యువకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

కీసర: గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు పంచాయతీ పాలక వర్గాలు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) రమణమూర్తి అన్నారు. శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం గోధుమకుంట గ్రామంలోని కృష్ణారెడ్డినగర్ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనులు, హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ, డంపింగ్‌యార్డు, గ్రేవ్‌యార్డు వద్ద పారిశుద్ధ్య పనులు, అదేవిధంగా నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కరీంగూడ, గోధుమకుంట, భోగారం, చీర్యాల, తిమ్మాయిపల్లి, అంకిరెడ్డిపల్లి, కీసర, యాద్గార్‌పల్లి తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, ధర్మేందర్, గోపాల్‌రెడ్డి, కవితాజైహింద్‌రెడ్డి, రాజు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అందంగా ముస్తాబు చేసేలా..

మేడ్చల్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఉపయోగించుకోవాలని స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రత్యేకాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని మునీరాబాద్ గ్రామాన్ని ఆదివారం సందర్శించిన ఆయన శానిటేషన్ డ్రైవ్‌లో చేపడుతున్న పనులను పరిశీలించారు. పలు వివరాలను గ్రామ సర్పంచ్ గణేశ్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ స్మిత, ఎంపీడీఓ పద్మావతి, గ్రామ సర్పంచ్ గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగరావు, గ్రామ కార్యదర్శి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


గోధుమకుంటలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో డీపీఓ రమణమూర్తి తదితరులు


వైకుంఠదామం సందర్శిస్తున్న ప్రత్యేకాధికారి నాగేశ్వర్‌రావు

18వ వార్డులో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) సెంటర్‌ను కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. చెక్క వస్తువులు, సామాగ్రి, బట్టలు, పుస్తకాలు ఇతర వినియోగించని సామాగ్రి ఉన్న వారు సెంటర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి అనిత తదితరులు పాల్గొన్నారు.


సెంటర్‌లో ఉపయోగపడని పుస్తకాలను సేకరిస్తున్న కౌన్సిలర్ భవాని

నాగారంలో జోరుగా ఆర్‌ఆర్‌ఆర్


నాగారం మున్సిపల్ పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో..

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ షెహర్‌లో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. ఆదివారం వివిధ వార్డుల్లో ప్రజల నుంచి ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమానికి స్పందన లభిస్తుంది. 5, 6, 7, 8, 9, 10, తదితర వార్డుల్లో ఆదివారం ప్రజలందరూ పాల్గొన్నారు. ఇళ్లలోని పాడిచెత్తకు సంబంధించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, షాంపూ కవర్ల నుంచి పుస్తకాల వరకు వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గూడురు సబితాఆంజనేయులుగౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, కౌకుట్ల మమతకృష్ణారెడ్డి, పంగ హరిబాబు, కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, మోకు రేణుక జగన్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


డబీల్‌పూర్‌లో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


కీసరలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


జవహర్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. మేడ్చల్ మున్సిపాలిటీలో డబీల్‌పూర్, నూతన్‌కల్, గౌడవెల్లి, గిర్మాపూర్ తదితర గ్రామాల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జవహర్‌నగర్: దేశానికి సాంకేతికను అందించిన మహనీయుడు మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ అని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం జవహర్‌నగర్‌లో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసి, ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి రాజీవ్‌గాంధీ అన్నారు.

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు.

ఘట్‌కేసర్: మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్, చౌదరిగూడ, ఘనాపూర్, ఏదులాబాద్‌లో రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.


చౌదరిగూడలో నివాళులర్పిస్తున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు


ఘట్‌కేసర్‌లో అనిత, మచ్చేందర్‌రెడ్డి తదితరులు

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతుల స్టాళ్లను సందర్శిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతు విజయం- ప్రకృతి రైతు బజార్ వేదిక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ దిశగా ముందుకు సాగాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆరోగ్యకర ఉత్పత్తులు లభించడం లేదని, అనారోగ్య ఆహారాన్ని తింటూ ప్రజలు రోగాల పాలవుతున్నారని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, రైతులు మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ విద్యార్థులతో కలిసి ప్రయోగాలు చేసి నాణ్యమైన ఉత్పత్తులను సాధించాలని కోరారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సమావేశంలో పలువురు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు తమ అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

బీబీనగర్: రైలు కిందపడి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద ఆదివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులబాద్ గ్రామానికి చెందిన రాచకట్ల చరణ్‌తేజ్ (23) రామాంతాపూర్‌లోని కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, తన అర్హతకు తగిన ఉద్యోగం దొరకడం లేదని చరణ్‌తేజ్ కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి కొండమడుగు మెట్టు వద్దకు చేరుకున్నాడు. స్థానిక సర్వీస్ రోడ్డులో బైక్‌ను పెట్టి పక్కనే గల రైల్వే పట్టాలపైకి వచ్చి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున స్థానికులు మృతదేహాన్ని గమనించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా చరణ్‌తేజ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఇంట్లో చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. రామకృష్ణపురంలో నివాసముండే ఆకారపు మారతమ్మ 20వ తేదీన తన ఇంటికి తాళం వేసి బయకు వెళ్లి మరుసటి రోజు వచ్చేసరికి ఇంట్లో 2 తులాల బంగారం, నగదు చోరీకి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

గౌడవెల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ఆదివారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో ఆరు జట్లు పోటీ పడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామ యువకుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు తమవంతు సహకారం అందిస్తామని గ్రామ మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రాజు, జగన్‌రెడ్డి అన్నారు.

నేర రహిత సమాజమే లక్ష్యం


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంపుగూడ గోపాల్‌రెడ్డినగర్‌లో ఆదివారం సైబర్ క్రైమ్, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం హాజరై మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే నిఘా ఉంచాలన్నారు. నేరాలకు పాల్పడే వారిని పట్టుకొని నేర రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రజలు తమ సొంతూర్లకు వెళ్లేటప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఎస్‌ఐలు సాయిలు, రాంబాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బడుగులు రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలి


మాట్లాడుతున్న రంజిత్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: విద్యాభివృద్ధితో బడుగులు రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పోచారం మున్సిపల్ టీఆర్‌ఎస్ నాయకుడు రంజిత్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఘట్‌కేసర్‌లో అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు అమలు కావాలంటే విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, రాజేశ్, శ్రీనివాస్, ఆనంద్, రాజేశ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, మహిపాల్, గణేశ్, సచిన్, సాయి, చరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

భూమిపూజలో మంత్రులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని శ్రీవినాయక ఐకానిక్ వెంచర్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న వెంచర్ భూమిపూజలో రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్ని వసతులతో, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా వెంచర్ ఏర్పాటు చేయాలని ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో మంత్రి తలసాని కుటుంబీకులు శంకర్ యాదవ్, ధరమ్ యాదవ్, మహేశ్‌యాదవ్, సాయికిరణ్‌యాదవ్, వెంచర్స్ ప్రతినిధులు రమేశ్‌యాదవ్, సూరి, బాల్‌రామ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నారాయణగౌడ్, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 2 నుంచి క్విజ్ పోటీలు


మేడ్చల్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

మేడ్చల్: ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ మండల నాయకులతో కలిసి ఆదివారం మేడ్చల్‌లో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని యువతను మేల్కొల్పేందుకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి పోటీలు ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాకు చెందిన యువత పోటీల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా స్మార్ట్‌ఫోన్, తృతీయ బహుమతిగా ట్యాబ్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళా టాపర్లకు ఎలక్ట్రికల్ స్కూటర్లను బహుమతులుగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆనంద్, రంజిత్, శ్రీధర్, సందీప్, వంశీ, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు ఫోన్: 76618 99899.